క్లుప్తంగా

సమాచార హక్కు చట్టం ప్రజాయుధం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఓ సంధ్య

ఉండి: సమాచార హక్కు చట్టం ప్రజల ఓ గొప్ప ఆయుధం వంటిదని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో సమాచార హక్కు చట్టం 2005పై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర, డిప్యూటీ తహసీల్దార్లు ఎం.రఘు, ఎస్వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు పరిష్కరించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణంలో 24వ వార్డులో కమీషనర్ కె.రామచంద్రారెడ్డి పర్యటించారు. వార్డు సమస్యలపై అధికార్లు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అలాగే వార్డులో సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే త్వరితగతినే పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రభుత్వం అందించే పథకాలను మరిన్ని సేవలను సకాలంలో ప్రజలకు అందజేయాలని ఆయన సూచించారు. కుళాయి, ఆస్థి పన్నులు ఎవరైనా బకాయిలు ఉన్నచో వెంటనే నోటీసులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రిజర్వ్ బ్యాంక్ క్విజ్ పోటీలపై అవగాహన



వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: రిజర్వ్‌బ్యాంక్ ఏర్పడి 90 ఏళ్లు అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ ప్రతినిధులు ఇ.గ్లాడ్‌సన్, జె.బెల్ షాజర్‌లు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు రూ.10 లక్షల మేర బహుమతులు అందజేస్తారన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నాలుగు దశల్లో పోటీలు నిర్వహించి, దేశ, రాష్ట్ర వ్యాప్తంగా విజేతల్ని ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె. ఆనంద కుమార్, ప్రిన్సిపాల్ కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

తోకతిప్పలో సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్: మండలంలోని తోకతిప్ప గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని లోసరి సచివాలయంలో గురువారం తోకతిప్ప సమస్యలను పరిష్కరించాలని వీఆర్వో కుమార్ రాజుకు సీపీఎం పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు బురదగా వస్తుందని తెలిపారు. గ్రామంలో కచ్చా డ్రైయిన్లు లేకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్న పంచాయతీ అధికారులకు పట్టడం లేదన్నారు. అసలే వర్షాలు ఎక్కువగా పడుతున్నాయని మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి జ్వరాలు వస్తాయమోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే ఫిల్టర్ బెడ్‌లు ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసి, దోమలు ప్రబలకుండా ఫాగింగ్ చేయాలని కోరారు.

అత్యాచారయత్నం

భీమవరం: పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మహిళపై మధు అనే వ్యక్తి అత్యాచారయత్నం చేశాడని పోలీసులు తెలిపారు. బాధితురాలితో ఆ వ్యక్తికి గతంలో స్నేహపూర్వక సంబంధం ఉండేదని, దాంతో బుధవారం రాత్రి శ్రీరాంపురంలోని ఓ ప్రాంతానికి రమ్మని ఆమెపై అత్యాచారానికి యత్నించగా ఆమె అరిచి కొట్టిపారిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఫాజిల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వర్షాలతో అన్నదాత ఆశలు గల్లంతు

- ఉధృతంగా యనమదుర్రు డ్రెయిన్ ప్రవాహం
- మూడోసారి నీట మునిగిన పంటలు
- రైతుల కంట కన్నీరు



యనమదుర్రులో ముంపునకు గురైన వరి పొలంలో తిరిగి నాట్లు వేస్తున్న రైతు

భీమవరం అర్బన్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నల కష్టం ఫలించాలంటే ప్రకృతి కరుణించాలి. అది ఏ మాత్రం కన్నెర్రజేసినా అన్నదాతల కష్టమంతా నీరుగారిపోతుంది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాలలో రైతులు ఇదే పరిస్థితులను ఎదుర్కొటున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనాలు కారణంగా కురిసిన భారీ వర్షాలకు రైతుల ఆశలు గల్లంతయ్యాయి. భీమవరం మండలంలోని చినఅమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం, దిరుసుమర్రు, యనమదుర్రు, కొమరాడ తదితర గ్రామాలలో సుమారు 4 వేల ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు. జూలైలో కురిసిన వర్షాలకు నారుమడులు, ముందుగా వేసిన మునిగిపోయి దెబ్బతినడంతో రైతులు మళ్లీ కొన్ని చోట్ల నారుమడులు వేసి వరి నాట్లు వేశారు. కొందరు రైతులు వేరే ప్రాంతాల నుంచి ట్రాక్టర్లపై వరినారును తీసుకువచ్చి నాట్లు వేశారు. అయితే ఇటీవల వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరి పొలాలు మునిగిపోయాయి. రైతులు పొలంలోని వరద నీటిని పంపేందుకు నానా కష్టాలు పడుతున్నారు.

వర్షాలతో క్రాప్ హాలిడే

గత ఏడాది సార్వాలో సుమారు 8 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగుచేశారు. అయితే ఈ ఏడాది జూలై నెల నుంచి అధిక వర్షాలు పడటంతో కొమరాడ, అనాకోడేరు, తాడేరు, బేతపూడి గ్రామాలలో పల్లపు ప్రాంతాలలో వరదనీరు లాగకపోవడంతో సుమారు 4 వేల ఎకరాలకు రైతులు క్రాప్ హాలిడే ప్రకటించారు. ఇటీవల వర్షాలతో వరద నీరు చేలల్లోంచి లాగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పడిన శ్రమ పెట్టిన పెట్టబడులు నీటి పాలవుతుంటే ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

తెగుళ్ల సోకే ప్రమాదం

ఇదే సమయంలో వరి పంటకు వివిధ రకాల తెగుళ్ల సోకే ప్రమాదం కూడా ఉంది. ముంపు ప్రాంతాలలో బాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులు నివారణకు ఎండిన ఆకులను కత్తిరించి , మంచి నీటితో ఉన్న గాజు గ్లాసులో వేయాలి. అరగంట తర్వాత పరిశీలిస్తే తెగులు ఆశించిన భాగాల నుంచి బాక్టీరియా నీటిలోకి ప్రవేశించడం వలన నీటి గాఢత పెరగడం, పసుపు రంగులోకి మారడం జరుగుతుంది. ఈ విధంగా ఉన్న పొలంలో నీటిని 2 లేదా 3 పర్యాయాలు నీరు బయటకు పోయేట్టు చేస్తూ కొత్త నీరు పెడ్డటం వలన తెగులు ఉధృతి తగ్గుతుంది.

> **ఆందోళన వద్దు..**
>
> 
>
> నాట్లు వేసి వారం నుంచి 30 రోజులైతే పొలంలో నీరు ఐదు రోజుల వరకు నిల్వ ఉన్న ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయధికారి నిమ్మల శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. ముంపుకు గురైన పొలంలో నీరు దిగువకు పోయే విధంగా చేసి ఒక కిలో యూరియా, ఒక కిలో పొటాష్‌లను చల్లుకోవాలి. అలాగే ఒక గ్రాము కార్బన్‌డిజం లేదా 2 గ్రాములు కార్బన్‌డిజంకి మాంకోజెట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు.
>
> మండల వ్యవసాయధికారి నిమ్మల శ్రీనివాస్

వరద బాధితులకు ఆర్థిక సాయం

పాలకోడేరు: వరద బాధితుల సహాయార్థం పాలకోడేరు మండలంలోని రేషన్ డీలర్లంతా కలిసి పది వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు నగదును గురువారం పాలకోడేరు మండల తహసీల్దార్ నడింపల్లి భారతీ విజయలక్ష్మికు మండల డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దొంగకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో డీటీ శేషయ్య,డీలర్లు కడిమి సత్యనారాయణ, సోము రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: కామ్రేడ్ సీతారాం ఏచూరి ఇక లేరన్న విషయాన్ని కామ్రేడ్లు, కార్మికులు, రైతాంగం జీర్ణించుకోలేకపోతున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. గురువారం ఏచూరి చిత్రపటానికి స్థానిక పార్టీ కార్యాలయంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సీతారం ఏచూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, షేక్ వల్లీ, బీవీ.వర్మ, బి.రాంబాబు, జి.ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



భీమవరం అర్బన్ వెంపలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



ఉండి: పాందువ్వలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

భీమవరం అర్బన్: గర్భిణులు, చిన్నారులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భీమవరం సీడీపీవో టీకేవీ లక్ష్మీకాంతం అన్నారు. భీమవరం మండలంలో వెంప గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో పోషకార మాసోత్సవాలలో భాగంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. తక్కువ ధరలలో లభించే జామ, ఉసిరి, నిమ్మ వంటి వాటిని ఆహారంలో వాడాలన్నారు. వీటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఆకుకూరలలో మునగాకు ప్రాముఖ్యతను గురించి వివరించారు. సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి మాట్లాడుతూ మహిళలు రక్త హీనత బారిన పడకుండా విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎన్ ప్రసన్న కుమారి, ఎస్ విజయలక్ష్మి, జి.అప్పాయమ్మ, జి. వెంకటలక్ష్మి, ఎమ్ రమాదేవి, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: పౌష్టికాహార లోపం వల్ల జీవితంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.వెంకటనాగలక్ష్మీ అన్నారు. గురువారం మండలంలోని పాందువ్వ గ్రామంలో పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వాణీ విజయరత్నం ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె.వెంకటరమణ, ఉపాధ్యాయుడు డి.గోపాలం, కేవీపీఎస్ నాయకుడు ఎం.గోపీ పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: పోషకాహార మేళాలో భాగంగా చిన్నారులకు అందించే పోషకాహారాన్ని అంగన్‌డీ కేంద్రాల్లో మ్యాపింగ్ ద్వారా ప్రదర్శించడం జరుగుతుందని ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి విజయరత్నం అన్నారు. పాలకోడేరు మండలం గరగపర్రు సెక్టారు కుముదవల్లి గ్రామంలో పౌష్టికాహార మహోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీఓ వాణి విజయరత్నం మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టకరమని పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ బాలాకుమారి, అంగన్‌వాడీ టీచర్లు టి.జెమియా, టి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి త్యాగరాజ భవనంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు



చిన్మయ మిషన్ కేంద్రంలో కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): చిన్మయ మిషన్ భీమవరం వారి ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి 30వ తేదీ వరకు భీమవరం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజ భవనం)లో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మాత ఈశాని చైతన్య తెలిపారు. భీమవరం టూ టౌన్ లోని చిన్మయ మిషన్ కేంద్రంలో జరిగిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. చిన్మయి మిషన్ భీమవరం శాఖ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్ మాట్లాడుతూ ఏడు రోజులు పాటు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అందరూ కూడా విచ్చేసి భగవంతుని అనుగ్రహం పొందాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చిన్మయి మిషన్ కార్యదర్శి కొత్త శ్రీనివాస్ ,కోశాధికారి గ్రంధి కుమార వరప్రసాద్, సభ్యులు పెరుమాళ్ళ ప్రతిమ, తమ్మన రామలక్ష్మి, బొండాడ ఇందిర, నూలి ప్రేమలత, కొత్త సుబ్రమణ్యం గుప్తా, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీల లెక్కతేల్చేందుకు కుల జనగణన అవసరం



బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రచురించిన కులాంధ్రప్రదేశ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సంఖ్య తేల్చాలనే ఉద్దేశ్యంతో కుల గణన చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తోందని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి పరంజ్యోతి అన్నారు. గురువారం భీమవరం అంబేడ్కర్ భవనంలో ఏపీ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కుల జనగణన బీసీల సదస్సు రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు రెండు ప్రధాన సామాజిక వర్గాలే పాలన సాగిస్తున్నాయని, బీసీలకు దక్కాల్సిన అసెంబ్లీ సీట్లను సైతం ఆ సామాజిక వర్గ నాయకులు పొందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకోడానికి దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీఎస్పీ ఆధ్వర్యంలో ప్రచురించిన కులాంధ్రప్రదేశ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురాల రత్నరాజు, నేషనల్ కో ఆర్డినేటర్ ఆకాష్ ఆనంద్, స్టేట్ కో ఆర్డినేటర్ జె పూర్ణ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు/కాళ్ల/ఉండి: వివిధ సబ్‌స్టేషన్స్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మోగల్లు సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, అందువల్ల పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, కుముదవల్లి, ఉండి మండలంలోని యండగండి, ఉణుదుర్రు గ్రామాలకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. అలాగే కాళ్ల మండలంలోని కాళ్ల , దొడ్డనపూడి, కాళ్ళకూరు, కోలనపల్లి , జువ్వలపాలెం, ఏలూరుపాడు పాతళ్ళమెరక గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఆకివీడు 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ల పనుల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆకివీడు పట్టణం లోనూ, సమతానగర్ ఇండ్రస్టియల్ ఫీడర్, గుమ్ములూరు రోడ్డులోని 11 కేవీ ఫీడర్స్, కుప్పనూడిలోని సబ్ స్టేషన్ 11కేవీ ఫీడర్స్‌పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శాంతించిన గంగమ్మ

ఆకివీడు: కొల్లేరు వరద పరవళ్లు తగ్గడంతో గంగమ్మ శాంతించిందని పలువురు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఉప్పుటేరులో నీటి ప్రవాహ వేగం పుంజుకుంది. బుధవారం సాయింత్రం ఉప్పుటేరు నీటి మట్టం స్థానిక ఆర్ అండ్‌బీ వంతెన వద్ద 2.58 మీటర్లుండగా, గురువారం సాయంత్రం 7గంటలకు 2.60 మీటర్లుంది. ప్రవాహ వేగం పెరగడంతో తీర గ్రామాల్లో భారీ ముంపు బెడద తప్పిందని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కొల్లేరు తీర గ్రామాల్లోని పలు రోడ్లపైకి, పంట పొలాల్ని ముంచెత్తిన వరద నీరు యథావిధిగా ఆయా ప్రాంతాల్లో నిలిచి ఉంది. దీంతో పచ్చని పంట పొలాలలు చెరువల్ని తలపిస్తున్నాయి. కొల్లేరులోకి చొచ్చుకువచ్చే గోదావరి నీటి మట్టం కూడా గురువారం సాయింత్రానికి తగ్గుముఖం పట్టిందని డ్రెయినేజీ శాఖ అధికారులు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఉండి: వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి బాలాజీరావుపేటకు చెందిన షేక్ మస్తాన్ అనే వ్యక్తిపై ఉండికి చెందిన కాట్రగడ్డ నవీన్ సుధాకర్, సురేష్ అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. తమకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగేందుకు వచ్చి ఈ నెల 10,11వ తేదీల్లో తనతో గొడవపడి తనను కొట్టారని బాధితుడు మస్తాన్ పోలీసులను ఆశ్రయించాడని ఎస్సై నసీరుల్లా తెలిపారు.

విపత్తు వేళ..బాధితులకు ఆపన్న హస్తం



గ్రంధి షణ్ముఖ్‌ను అభినందిస్తున్న జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి



కలెక్టర్ నాగరాణికి చెక్ అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడలో వరద బాధితులకు ప్రభుత్వ మాజీ విప్ గ్రంధి శ్రీనివాస్ మనుమడు గ్రంధి షణ్ముఖ్ తనవంతు సాయంగా రూ.20,850 చెక్కును కలెక్టర్ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో విజయవాడలో కొన్ని డివిజన్లు అతలాకుతలమై ఆ ప్రాంత ప్రజలు అన్ని విధాలుగా నష్టపోయారని, వారిని ఆదుకోవడానికి తాము సైతం అంటూ చిన్నారులు కూడా ముందుకు రావడం అందరికీ స్ఫూర్తిదాయమన్నారు. ఈ సందర్భంగా చిన్నారి గ్రంధి షణ్ముఖ్‌ను జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి అభినందించి, ఆశీర్వదించారు.

బజార్ లాగుడు బండ్ల ముఠా కార్మికుల విరాళం

భీమవరం: విజయవాడ వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు సహకారం అందించడానికి భీమవరం బజార్ లాగుడు బండ్లు ముఠా కార్మిక సంఘం రూ. 25 వేలు విరాళాన్ని గురువారం భీమవరంలో సీఐటీయూ జిల్లా నాయకత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జెఎస్వి గోపాలన్ మాట్లాడుతూ విజయవాడలో వరద బాధితులను ఆదుకోవడంలో కేంద్రప్రభుత్వం సరిగా స్పందించలేదని విమర్శించారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు రోజు కూలి చేసుకునే కార్మికులు రూ. 25 వేలు విరాళం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి వాసుదేవరావు, ఎం ఆంజనేయులు, రాము, శ్రీను, కె అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగల విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.7,54,030 రూపాయలు చెక్కును గురువారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు ఉద్యోగ నిర్వహణలో ప్రజలకు అందించే సేవలతో పాటు ఆపద కాలంలో ఉన్న వారిని సహృదయంతో ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జె.ఉదయ భాస్కరరావు, పశ్చిమగోదావరి జిల్లా రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వరదబాధితుల సహాయనిధికి విరాళాలు

భీమవరం: రాష్ట్రంలో భారీవర్షాలు, వరదలు కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకోడానికి భీమవరం పట్టణంలో పలువురు దాతలు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు గురువారం క్యాంపు కార్యాలయంలో విరాళాలు అందచేశారు. భీమవరం మండలం చినఅమిరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల ప్రసాదరాజు రూ.2 లక్షలు అందించారు. అలాగే పట్టణంలోని మారుతీనగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 21,116 అందించారు. అలాగే తాడేరు గ్రామానికి చెందిన తిరుమల వెంకటేష్, వేదేష్ రూ. 50 వేలు, అడబాల వెంకటరామకృష్ణ రూ. 25 వేలు, మెప్మా సీఆర్‌పీలు రూ. 2 లక్షలు అందజేశారు.

వైభవంగా గణనాథుడి ఊరేగింపు



ఆకివీడు: ఊరేగుతున్న వెలంపేటలోని రామాలయం వినాయక విగ్రహం



ఉండి: మహదేవపట్నంలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



కాళ్ల: వేలంపాటలో 6 కేజీల లడ్డు ప్రసాదం దక్కించుకున్న భక్తులు

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు మండపాల్లో స్వామి వారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్థానిక వెలంపేటలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. శక్తి వేషాలు, గరగ నృత్యాలు, డప్పువాయిద్యాలు తీన్‌మార్‌తో ఊరేగింపు జరిగింది. అనంతరం వెంకయ్య వయ్యేరు కాలువలో నిమజ్జనం చేశారు.

ఉండిలో..

ఉండి: మండలంలో వినాయక నిమజ్జన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. గురువారం మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. మహదేవపట్నం గ్రామంలోని ప్రధాన వీధుల్లో వినాయక స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు.

రూ.1.30 లక్షలు పలికిన లడ్డూ ప్రసాదం

కాళ్ల: గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా 6 కేజీల స్వామి వారి లడ్డూ ప్రసాదం వేలం పాటలో రూ.1,30,000కు ఓ భక్తుడు దక్కించుకున్నాడు. కలవపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద 7వ వార్షికోత్సవం సందర్భంగా లడ్డు ప్రసాదం వేలం పాటను గురువారం నిర్వహించారు.ఈ వేలం పాటలో మంతెన శేషురాజు 6 కిలోల లడ్డూను రూ.1.30 లక్షలు దక్కించుకున్నారు. ధర్మకర్త మంతెన సాయికృష్ణంరాజు చేతుల మీదుగా ఆయనకు ఈ లడ్డు ప్రసాదాన్ని అందించారు.